కథానిక

# మరపురాని జ్యోతి

డి. వాణి

ఆరోజు రాత్రే నా 'డెహరాడూన్' ప్రయాణం.

నా మనస్సంతా ఆందోళనతో నిండిపోయింది. ముఖ్యంగా మా అక్కకూతుళ్లు నీరజ, పద్మజలను విడిచివెళ్లాలని చాల బాధపడ్డాను. సాయంత్రం అక్కగారింటికి వెళ్తూ బిస్కట్లు, గౌన్లు తీసుకెళ్ళాను. ఇంటికెళ్ళగానే "మామయ్యా!"అంటూ నన్ను చుట్టేశారు. వాళ్ళిద్దరితో ఆడుతూ, కబుర్లు చెప్పుతూ కూర్చున్నాను.

"ఏడాదిపాటు యీ పాపలను వదిలి యెలా ఉండగలనా?" అన్నదిగులు నన్నావరించింది. మిలిటరీలో చేరినందుకు విసుక్కున్నాను. రాత్రి భోజనం చేశానో లేదో కారువచ్చేసింది.

'వెళ్తానక్కా! బావగారూ వెళ్తాను,' అన్నాను.

"దూరదేశం! జాగ్రత్తగాఉండు." అంది అక్క. తల్లిపోయినప్పటినుంచి నన్నుతిప్రేమగా పెంచిన అక్కనువిడిచికెళ్ళటం నాకు చాలబాధకలగజేసింది.

"మేమూ వస్తాం మామయ్యా," అంటూ నీరజ, పద్మజ మారాం చేశారు. నేనక్కడ వుండలేక కారెక్కాను.

"వాడికి చిన్నప్పటినుంచి పిల్లలంటే చాల ఇష్టం," అన్నఅక్కమాటలు చెవుల్లో రింగుమంటూ ఉండగా కారు బయలుదేరింది.

* * *

అబ్బ! ఏమీ తోచేదికాదు. మాక్వార్టర్సులో వాళ్ళంతా సరదాగా మాట్లాడుకుంటూంటే నేను మౌనంగాఉండిపోయేవాడిని. ఉదయం,సాయంత్రం వర్కుండేది. మిగతాసమయాల్లో చదువుకుంటూ ఉండేవాడిని.

"రావు ఏకాంతవాసి," అంటూ మిత్రులు హేళనచేసేవారు. నాకెప్పుడూ నీరజ, పద్మజ గుర్తొచ్చేవారు. ఆరునెలలు గడవడం బ్రహ్మాండమైపోయింది.

"ఎందుకండీ రావ్, మీరలా దిగులుగా ఉంటారు?" అని ప్రశ్నించా డొకమిత్రుడు. నాకు పిల్లలంటే చాల ఇష్టమనీ, మా అక్కపిల్లలనువదిలి రావటంవల్ల దిగులుగా ఉందని చెప్పాను.

"మీకింత చిన్నవయస్సులో పిల్లలమోజెలా ఉందండీ?" అంటూ ఆశ్చర్యంగా నవ్వాడు.

* * *

అప్పుడప్పుడు మాకు యెక్కడికైనా వెళ్ళటానికి అనుమతిచ్చేవారు. మా మిత్రులు వెళ్ళినా, నేను మాత్రం కదిలేవాడినికాదు. ఒకసారి ఆదివారం మా ఫ్రెండ్సు పిక్నిక్ యేర్పాటుచేశారు. నన్ను రమ్మన్నారు. కాని రానని చెప్పాను.

"రావ్ ఏకాంతవాసి అని పేరుపడ్డారుగా!" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. చాల సేపటి వరకూ చదువుకుంటూ కూర్చున్నాను. సాయంత్రం ఆరయాక షికారు బయల్దేరాను. ఒకచోట ఇసుక దిబ్బలు, చెట్లు ఉన్నాయి. అస్తమించే సూర్యుని యెర్రనికాంతులు వ్యాపిస్తున్నాయి. చల్లని పిల్లవాయువులు వీస్తున్నాయి: కూర్చున్నాను. "మామయ్యా!" అని పద్మజ పిలిచినట్లయింది. కొంతసేపాలోచనలతో గడిచిపోయింది.

ఇంతలో "మమ్మీ,' డాడీ," అన్న మృదుమధురమైన పిలుపు వినబడింది. నేను చటుక్కున వెనుదిరిగి చూశాను. ఆ పాపకు ఆరేళ్లుంటాయి. పంజాబీ డ్రెస్సు, రెండు జడలు, కనుముక్కుతీరు ఎంతో ముద్దుగాఉంది. ఇసుకలో ఆడుతూ దూరంగానడుస్తూన్న అమ్మనీ, నాన్ననీ పిలుస్తోంది. నేనుండలేకపోయాను. ఆరునెలల ఆవేదన ఆపాపను చూడగానే తీరిపోయినట్లయింది. ఆపాపదగ్గరకెళ్ళి, "బేబీ, నీ పేరేంటి?" అన్నా సింధీలో. ఆ పాప ఒక్కసారి నా వైపు బెదురుగాచూచి పరుగెత్తుకుని వెళ్ళిపోయింది. నేనా పాపవెళ్ళిన వైపే చూస్తూ దిగులుగా ఉండిపోయాను.

* * *

ఆ పాప నాకు బాగా గుర్తుండి పోయింది. మరునాడు సాయంత్రం వెళ్ళాను. ఆ పాపక్కడే

ఉంది. నేను మెల్లగా వెళ్ళి "బేబీ, భయపడకు. నీ పేరేమిటి?" అన్నా. ఏ కళనుందోగాని వెంటనే, "జ్యోతి," అని జవాబిచ్చింది.

"జ్యో మనం ఆడుకుందామా?" అన్నాను కూర్చుంటూ.

"హై! నా పేరెలా తెలుసు!" నన్ను మా మమ్మీ, డాడీ 'జ్యో' అనే పిలుస్తారు," అంది నవ్వుతూ. ఆ ముద్దుమాటలు నాకెంతో హాయిని యిచ్చాయి.

"ఆడుకుందాం!" అని గంతులేసింది. చాలసేపు ఇసుకలో ఆడుతూ కూర్చున్నాం. తరువాత జ్యోతి ప్యాన్‌తో వెళ్ళిపోయింది. జ్యోతి వెలుగంతా తీసుకొని వెళ్ళిపోయినట్లుగా చుట్టూ చీకట్లావరించాయి.

* * *

నేను సరిగా అక్కడికి వెళ్ళేసరికి "బాబూ!" అంటూ నా దగ్గిరకి పరుగెత్తుకుని వచ్చేది. ఏవో పిచ్చిఆటలు ఆడేవాళ్లం. కాలం హాయిగా గడిచి పోయేది. "బాబూ!" అని భుజాలమీంచి చేతులు వేసి కళ్ళల్లోకి చూచేది. "జ్యో" అంటూ తన్మయం చెందేవాడిని. ఒక రోజు, "మా ఊరొస్తావా?" అన్నాను.

"ఏ ఊరు?" అంది కళ్ళుత్రిప్పుతూ.

"పూనా" అన్నాను.

"ఆ వూరు బాగుంటుందా? బేబీలున్నారా?" అంది చేతులు పట్టుకుని ఊగుతూ.

"చాలా బాగుంటుంది. అక్కడ యిద్దరు నీలాంటి బేబీలే వున్నారు. నీరజ, పద్మజ." అన్నాను.

"నీరజ, పద్మజ" అని రిపీట్ చేస్తూ నవ్వింది. చిలిపిగా. గంటలు నిముషాలు గడిచేవి.

* * *

ఆ రోజు వెళ్ళాను. కాని జ్యో చాలసేపటి వరకు రాలేదు. వచ్చేస్తూండగా "బాబూ" అన్న పిలుపు, చప్పట్లు వినిపించాయి. వెనుదిరిగి చూచే సరికి జ్యో! పరుగెత్తుకుని వెళ్ళాను. వాళ్ళమ్మ... నాన్న కూడా ఉన్నారు.

"మా మమ్మీ, డాడీ" అని చెప్పింది. వారు చాలా మంచివారుగా కనిపించారు. కాని జ్యో తల్లి కళ్ళలో నీళ్లు నన్నాశ్చర్యపరిచాయి.

"మీరిక్కడ ట్రైనింగుకివచ్చారా? మీ పేరు?" అని జ్యో తండ్రి ప్రశ్నించాడు. విషయంచెప్పాను.

"మీకు పిల్లలంటే చాలా యిష్ట మనుకుంటాం. మా జ్యో మీగురించి చెప్తూ ఉంటుంది" అన్నాడు నవ్వుతూ. జ్యోతి, నేను ఆటలాడుతూ కూర్చున్నాం. కొంత సేపటి తరువాత వచ్చేశాను.

* * *

జ్యోతిని వదలా లనిపించేదికాదు. ట్రైనింగు ఎప్పుడౌతుందా? అనుకున్న నేను అవకుండావుంటే బాగుండు ననుకునే వాణ్ణి. జ్యో మమ్మీ, డాడీలు చాల ఆదరించేవారు. కాని జ్యో మమ్మీకి నన్ను చూడగానే కళ్ళనీళ్లు తిరిగేవి. అడుగుదామనుకుని జంకేవాడిని. జ్యో, నేను ఫొటోతీయించుకున్నాం.

"నువ్వు బాగా చదువుతావా జ్యో?" అన్నా నొక రోజు.

"ఓ చదువుతాను. ఇప్పుడే చదువుతున్నా" అంది కిలకిల నవ్వుతూ.

"ఏమండోయ్ రావుగారూ! ఈమధ్య హుషారుగా ఉంటున్నారే?" అనడం ప్రారంభించారు స్నేహితులంతా. నేను నవ్వి ఊరుకునేవాడిని.

* * *

చిన్న పాప జ్యో, నేను గడిపిన ఆనందపు రోజులు మరువరానివి. దూర దేశంలో, జ్యో నా ప్రాణమైపోయింది. జ్యోని తల్చుకుంటేనే నా కెంతో హాయిగా ఉండేది.

ఆ చిన్నిపాప చిలిపి మాటలు ముద్దులు మూట గట్టే ముఖం నన్ను నీడలా వెన్నాడేవి. ట్రైనింగు పూర్తయింది. జ్యోని వదిలివెళ్ళాలన్న బాధ నన్నావరించింది. రెండురోజుల్లోనే వెళ్ళాలని ఆర్డరు వచ్చింది. మిత్రులందరితో ఒకరోజుగడిచిపోయింది. ఆరోజు జ్యోతిని కలుసుకోలేకపోయాను. మరునాడు ప్రయాణమనగా ముందురోజు వెళ్ళాను. గేటుదగ్గిర్నుంచుని 'జ్యో'అని పిలచాను అలవాటుగా. కర్టెన్ తొలగించి గబగబా పరుగెత్తుకుని వచ్చి, "బాబూ,"అని చేతులుపట్టుకొంది. లోపలికెళ్ళి కూర్చున్నాం.

"రాలేదేంబాబూ? రెండురోజులయింది" అంది జ్యో. నాకు మాట్లాడటం కష్టమయింది.

"నేను వెళ్ళిపోవాలి జ్యో!" అన్నాను.

"ఎక్కడికి బాబూ?"అంది ఆత్రుతగా.

"పూనా వెళ్ళాలి. మరింక రాను"అన్నాను.

"ఊహూ! నువ్వు వెళ్ళొద్దు! నేనూ ఒస్తాను" అంది పట్టుదలగా. ఇంతలో జ్యోతి తండ్రి ఒచ్చాడు.

"నేను వెళ్ళిపోవాలండి. మర్చిపోకండి"అన్నా.

"వెళ్ళిపోతున్నారా! మా జ్యో బెంగపెట్టుకుంటుందేమో?"అన్నాడు. జ్యో మమ్మీ టీ తెచ్చిపెట్టూ, 'మీరు వెళ్లిపోతారా?'అన్నది. ఆమెగొంతుకలో వేదనధ్వనిస్తోంది. ఆమెకళ్లునీళ్ళతో నిండాయి.

"మీరేమీ అనుకోకపోతే ఒకటడుగుతాను" అన్నాను. "ఏమిటి బాబూ?"అంది.

"మీ కళ్ళనీళ్ళకు కారణంచెప్పరూ?"అన్నాను. ఆమె ఆపుకోలేక భోరున యేడ్చేసింది. జ్యో దిగులుగా వుండిపోయింది.

"క్షమించండి. మీకు కష్టం కలిగించానేమో."

"మా అబ్బాయి నీలాగే ఉండేవాడు బాబూ! మమ్మల్ని విడిచి వెళ్ళిపోయాడు. ఆరేళ్ళయింది. ప్రమోదుజీవితం అలవాటైంది"అన్నాడు గద్గదికంగా. నేను చాలా బాధపడ్డాను. "బాబూ! నీవెళ్ళిపోతే నేను, మా జ్యోకూడా ఉండలేం."అంటూ ఆవిడ ఏడ్చింది.

"బాబూ,నువ్వు వెళ్ళొద్దు"అంటూ నాకాళ్ళను చుట్టుకొంది. జ్యోకి ప్రజెంటుగా దంతపు బొమ్మనిచ్చాను. కొంతసేపు కూర్చున్నాక వెళ్ళొస్తానని చెప్పాను. జ్యో మమ్మీ, "మర్చిపోకు బాబూ!" అంది గద్గదికంగా. నా మనస్సు వేదనతో నిండిపోయింది. జ్యో గేటువరకూ వచ్చి నిల్చుంది.

"వెళ్ళొస్తా జ్యో. బాగా చదువు, బాబూను మర్చిపోకు" అన్నాను. కళ్లు తుడుచుకుంటూ "బాబూ ఛీరియో"అంటూ చెయ్యిఊపింది. జ్యోను వదల్లేక, వదల్లేక చూస్తూ వచ్చేశాను. ఈ సంఘటన మరువరానిదైంది. నా జ్యో...చిన్నారి జ్యో మాత్రం స్మృతిపథంలో నిల్చిపోయింది.

---

కథానిక

# నవభారతంలో ఉద్యోగపర్వం

యఱ్ఱా మురళీ కృష్ణమోహన్

మా నాన్న స్కూలు ఫైనలుకూడా పాసుకాలేదు. అయితేనేం? తాలూకా గుమాస్తా. నేను బి. ఏ. పాసయ్యాను. కాని నాకు ఆ గుమాస్తా ఉద్యోగంకూడా దొరకలేదు. కవిత్వం చెప్పబోయి విమర్శలో పడ్డట్టు, గుమాస్తాగిరీకూడా కరువయ్యేసరికి ఇన్సూరెన్సులోకి దిగాను.

ఇన్సూరెన్సు పనిమీద ఆగ్రామం వెళ్లవలసి వచ్చింది. గ్రామం ప్రవేశించగానే 'కనకమహాలక్ష్మి' కాఫీ హోటల్ కనిపించేసరికి నా ప్రాణాలు కుదుటబడ్డాయి. గ్రామమునసబుగారింటికి వెళ్లి నన్ను నేను ఎరుక పరుచుకోనేసరికి; ఆయన "నువ్వా! సర్వేశం! ఎప్పుడో ఇంతప్పుడు చూసాను. జ్ఞాపకమే లేదు. ఉద్యోగం చేస్తున్నావటగా? ఎంతిస్తారేంటి? అమ్మానాన్నా కులాసాయేనా? తాతయ్య వంట్లో ఆరోగ్యంగా వుంటోందా? ఆమధ్య మీ పూరొచ్చానులే; తాతయ్య వంట్లో కులాసా లేదన్నాడు." అంటూ ఆయనో ప్రశ్నల వర్షం కురిపించాడు. ఆయన ప్రశ్నలకు తాపీగా సమాధానాలు చెప్పాను. "లేమరి; ప్రొద్దుట ఎప్పుడు తాగావో కాఫీనీళ్లు" అని ఆయన అనేసరికి నా సమాధానాలకు తృప్తి పడ్డాడని అనుకొని భోజనానికి లేచాను.

ఆత్మారాముడ్ని సంతుష్టి పరిచేసరికి, నిద్రాదేవి ఆవహించింది. సాయంత్రం మూడుగంటలకు కాని వదల్లేదు ఆ మహాతల్లి. లేచి ఇన్ని కాఫీనీళ్లు పొట్టలోపోసుకొని వచ్చినపనేమిటో చూసుకోనేందుకు బయలుదేరాను-

పని ముగించుకొని తిరుగుముఖం పట్టేసరికి సంధ్యాసమయం అయింది. మంద మందలుగా వస్తూన్న గొడ్డుగోదలను తప్పించుకొంటూ, ఆకాశానికి చిన్న మేఘంలా లేస్తున్న గోధూళినుంచి నాశికను చేరుమాలుతో సంరక్షించుకొంటూ, చిన్నచిన్న మట్టిగడ్డలు కాబూలీషూలో దూరి గల్లంతుచేస్తూంటే నెమ్మదిగా నడకసాగిస్తూ